క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కార్తిక మాసం మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత


బాధిత కుటుంబానికి బియ్యం అందజేస్తున్న రాజారెడ్డి

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో గత రెండో రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు స్థానిక ఎస్సీ పేటలో బి.శ్రీరాములు ఇల్లు ఫాడైంది. దీంతో శ్రీరాములు కుటుంబానికి లయన్స్ క్లబ్ తరఫున 25 కేజీల బియ్యం, రూ.2 వేల ఆర్థిక సాయాన్ని లయన్స్ క్లబ్ మెంటర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మండ రాజారెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పంచాయతీ విభాగం అధ్యక్షుడు సబ్బెళ్ల మోహన్ రెడ్డి, గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, పప్పు రామకృష్ణారెడ్డి, రాయుడు వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అవసరం


విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న సుబ్రహ్మణ్యం

పెదపూడి: విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమని రిటైర్డ్ హెచ్ఎం వారణాసి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం పెదపూడిలోని జూనియర్ మహిళా కళాశాల విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. స్థానిక యువకుల బృందం తంగెళ్ల వెంకటేశ్వర గోవిందరాజులు, శీరం దివ్య ప్రశాంత్, చింతా సూర్యప్రకాష్ తదితరులు 40 మంది విద్యార్థినులకు సుమారు రూ.30 వేల విలువైన యూనిఫాం సమకూర్చారు. వాటిని సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష తులసి పూజ


ప్రత్యేక అలంకరణలో గరుడ వాహనంపై ఉన్న వేణగోపాలస్వామి

పెదపూడి: మండలంలోని వేండ్రలో వేణుగోపాల స్వామి, అమ్మవార్లకు కార్తిక మాసం సందర్భంగా ప్రముఖ పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో లక్ష తులసి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కుంకుమ పూజ, హోమం చేశారు. స్వామి వారిని హంస వాహనంపై అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

9 నుంచి కులగణన సర్వే


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

రాజానగరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9 నుంచి మండలంలో కులగణన సర్వే నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. గ్రామ గ్రామాన జరిగే ఈ సర్వేను పూర్తి పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సర్వే ప్రక్రియపై ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులకు అవగాహన కల్పించేందుకు స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, రాష్ట్రంలో మొదటిసారిగా 1931లో కులగణన సర్వే జరిగిందన్నారు. సర్వే జరిగే విధానం, ప్రాధాన్యం తదితర అంశాలను వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కోడి రాఘవ, ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకుడు వేమగిరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తుపాను వేగంతో స్పందన

- భారీ వర్షాల నేపథ్యంలో స్పందించిన ప్రభుత్వ యంత్రాంగం
- బాధిత రైతులకు అన్నివిధాలా అండ
- జోరు వానలోనూ ధాన్యం కొనుగోళ్లు


కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సీతానగరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బ తిన్న రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం తుపాను వేగంతో కదులుతోంది. ఓవైపు తుపాను సహాయక చర్యలు చేపడుతూనే మరోవైపు పంటలు నష్టపోతున్న అన్నదాతలను ఊరట కలిగించే చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా, ఆ ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన మిల్లులకు తరలిస్తున్నారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ పాగిరి కృష్ణారావు, మండల వ్యవసాయ, సరఫరా అధికారులు కె.సూర్యరమేష్, అచ్యుత కుమారి కలిసి మంగళవారం ముగ్గళ్ళ, వంగలపూడి, కాటవరం, సింగవరం తదితర గ్రామాల్లో పర్యటించారు. రైతులు రాశులుగా ఉంచిన 40 టన్నుల ధాన్యాన్ని జట్టు కూలీలతో తూకం వేయించి, ట్రాక్టర్లు, లారీలపై మిల్లులకు తరలించారు. ఇదిలా ఉండగా, కొంత మంది రైతులు ఇప్పటికే నూర్చిన ధాన్యంపై బరకాలు వేసి, వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వీటిని కల్లాలు, రోడ్ల పక్కన భద్రపరిచారు. ఈ ధాన్యం కొనుగోలు చేసేందుకు కూడా అధికారులు సమాయత్తమవుతున్నారు. అయితే, ఇప్పటి వరకూ కోతలు జరగని పొలాల్లో వరి పంట నేలకు అంటింది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల్లో వర్షాలు తగ్గితే ఫర్వాలేదని, వర్షాలు ఎక్కువగా ఉంటే కంకుల నుంచి మొలకలు వస్తాయని ఆవేదన చెందుతున్నారు.

మధురపూడి: కోరుకొండ మండలంలో కూడా ఇప్పటికే నూర్చిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ, రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తుపాను ప్రభావంతో కోరుకొండ మండలంలో 265 ఎకరాల విస్తీర్ణంలోని వరి పంట నేలకొరిగింది. ఈ ధాన్యం పూర్తిగా తడిసి, పాడవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని ప్రభుత్వ యంత్రాంగం భరోసా ఇస్తోంది. వ్యవసాయ శాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, మండల వ్యవసాయ అధికారి గౌరీదేవి పలు గ్రామాల్లో పర్యటించి, రైతులకు సూచనలు చేశారు. తుపాను కారణంగా వరి కోతలు విరమించుకోవాలని, చేలల్లో చేరిన వర్షం నీటిని బయటకు పంపాలని, కోసిన పంట మొలకెత్తకుండా ఉండేందుకు పనలపై పడేవిధంగా 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని, నీరు నిలిచి ఉంటే పనలను గట్ల పైకి తీసుకొచ్చి ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుపాను వలన మండలంలోని తోటలకు అంతగా నష్టం లేనప్పటికీ, కొబ్బరి, కూరగాయల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఉద్యాన శాఖ అధికారి రిని తెలిపారు. కొబ్బరి తోటల్లో మొవ్వ కుళ్లిపోకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల చొప్పున మొవ్వ భాగం, ఆకులు తడిసే విధంగా పిచికారీ చేయాలని సూచించారు. కూరగాయలు కుళ్లిపోకుండా, నేల రాలిపోకుండా తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఇదిలా ఉండగా ఈదురు గాలుల తాకిడికి కోరుకొండ మండలం గాడాల సబ్ స్టేషన్ పరిధిలోని నిడిగట్ల రోడ్డులో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ శ్రీధర్‌వర్మ, డీఈఈ చిట్టిరాజు, ఏఈ మదర్‌షా వెంటనే స్పందించి, ప్రత్యామ్నాయ పద్ధతుల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నానుతున్న పంటలు

రాజానగరం: గడచిన రెండు రోజుల్లో తుపాను ప్రభావంతో రాజానగరంలో 50.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో పొలాలు, పల్లపు ప్రాంతాల్లోకి వర్షం నీరు చేరింది. కొన్నిచోట్ల రోడ్లపై కూడా కాలువలా ప్రవహిస్తోంది. కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో ఆలస్యంగా సాగు చేసిన వరి పంట కోతకు వచ్చింది. కొన్నిచోట్ల కోతలు కూడా చేస్తున్నారు. ముఖ్యంగా నామవరం, కొండగుంటూరు, సంపత్‌నగరం, జి.యర్రంపాలెం, తుంగపాడుతో పాటు కోరుకొండ, సీతానగరం మండలాల్లోని పలు ప్రాంతాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. సరిగ్గా ఇదే తరుణంలో వానలు ముంచెత్తుతూండటంతో పంటలు నేలకొరిగి, నీట నానుతున్నాయని రైతులు వాపోతున్నారు. కలవచర్ల, నర్సాపురం, కోరుకొండ, శ్రీరంగపట్నం, నల్లగొండ, రఘుదేవపురం తదితర ప్రాంతాల్లో కూరగాయల పంటల్లో కూడా వర్షపు నీరు నిలిచిపోతోంది. దీంతో పాదులు దెబ్బ తింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గోకవరంలో ఎడతెరిపిలేని వర్షం

గోకవరం: మండలంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షాల కారణంగా గంగంపాలెం, తదితర గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నీట మునిగింది. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు. మండలంలో పలు ఉద్యానవన పంటలను కోరుకొండ ఉద్యానవనశాఖ అధికారి పి.రిని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.


సీతానగరం మండలం ముగ్గళ్ళలో ధాన్యం తూకం వేయిస్తున్న ఎంఎస్ఓ అచ్యుత కుమారి


రాజమహేంద్రవరం - సీతానగరం రోడ్డుపై ముగ్గళ్ళ వద్ద ధాన్యం రాశులు


రాజానగరం మండలం కొండగుంటూరులో వాన నీట నానుతున్న వరి పంట


గోకవరం మండలం గంగంపాలెంలో నేలకొరిగిన వరి పంట


కోరుకొండ మండలం గుమ్ములూరులో కూరగాయల రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి రిని

నాడు రూ.15 లక్షలే.. నేడు రూ.4.80 కోట్లు

- ఇదీ చక్రద్వారబంధం అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన ఖర్చు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వెల్లడి
- జోరు వానలోనూ గ్రామంలో గడప గడపకూ కార్యక్రమం


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: 'చక్రద్వారబంధం గ్రామ అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వం రూ.15 లక్షలు మాత్రమే ఖర్చు చేసింది. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గడచిన నాలుగున్నరేళ్లలోనే రూ.4.80 కోట్లు ఖర్చు చేశాం' అని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. గ్రామంలో ఆయన మంగళవారం రాత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జోరున వర్షం కురుస్తున్నప్పటికీ గొడుగు సాయంతో ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వారి ముంగిటనే అందిస్తూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారంజకమైన పాలన అందిస్తోందని చెప్పారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అన్నారు. వివిధ సమస్యలు పరిష్కరిస్తూ, గ్రామాల ప్రగతికి కోట్లాది రూపాయాలు వెచ్చిస్తోందని, నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ.వెయ్యి కోట్ల మేర అభివృద్ధి జరిగిందని తెలిపారు. అలాగే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు మరో రూ.వెయ్యి కోట్లు అందజేశామన్నారు. ఈవిధంగా అటు పేదలు, ఇటు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరోసారి అధికారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు వాడ్రేవు శ్రీనివాస్ కుమార్, నాగవరపు త్రిమూర్తులు, నీలపాల శివరామకృష్ణ, దుర్గా రమేష్, గుత్తుల చంద్రరావు, కురుమల్ల బాబీ, యాళ్ల నిరీక్షణరావు, ఎస్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో పంటకు రక్ష


శహాపురంలో పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ మణిదీప్

పెదపూడి: మిచాంగ్ తుపాను కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అనేకచోట్ల వరి పంట పొలాలు నీట మునిగాయి. ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో వరి చేలు నేలకొరిగాయి. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు పాటిస్తే వర్షాలకు దెబ్బతిన్న పంటను రక్షించుకోవొచ్చని మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ రైతులకు వివరించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ సుభాష్‌తో కలిసి ఆయన మండలంలోని శహపురం, సంపర, పెదపూడి, కరకుదురు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. తడిసిన వరి పంట, ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు.

ఆయన అందించిన సూచనలు

- పంట కోసిన, పూర్తిగా ఆరని పనలను కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై జల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు.
- కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిస్తే గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేలా పిచికారీ చేయాలి. ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉంటే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి.
- కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలి. నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా నివారించుకోవచ్చు.

రైతులు నష్టపోకుండా చర్యలు

జేసీ ఎన్.తేజ్‌భరత్


పాలమూరులో ధాన్యపు రాసులను పరిశీలిస్తున్న జేసీ తేజ్‌భరత్

అనపర్తి: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుందని జేసీ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు. మంగళవారం మండలంలోని దుప్పలపూడి, పాలమూరు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా రైతులు ఇబ్బందులకు గురికాకుండా ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ లోనూ యుద్ధ ప్రాతిపదికన ధాన్యం సేకరణకు చర్యలు తీసుకున్నామన్నారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. రాసులుగా ఉన్న ధాన్యాన్ని తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు తరలింపుకు హమాలీలను ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. జేసీ వెంట తహసీల్దార్ వై.సరస్వతి, ఏఓ బి.సురేష్ కుమార్ తదితరులున్నారు.

కూరగాయ తోటల్లో సస్య రక్షణ చేపట్టాలి

సీతానగరం: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కూరగాయలు, ఉద్యాన రైతులు సరైన యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖాధికారి పి.రిని సూచించారు. సీతానగరం, సింగవరం, మిర్తిపాడు, ఉండేశ్వరపురం గ్రామాల్లోని కూరగాయ, పాదులు, అరటి, బొబ్బాయి పంటలను మంగళవారం ఆమె పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే 19-19-19 లేదా 13-0-45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారీ చేయాలని, అవసరాన్ని బట్టి సూక్ష్మపోషకాలు కూడా పిచికారీ చేసుకోవాలని సూచించారు. నేల ఆరిన తరువాత రసాయనిక ఎరువులు వేసుకోవాలని, వర్షాలు ఆగిన వెంటనే కలుపు తొలగించి, నేల త్వరగా ఆరేలా చేసుకోవాలన్నారు. వంగ, కాకర, ఆకాకర వంటి పంటల్లో అక్షింతల పురుగు, చిత్త పురుగుల నివారణకు వర్షాలు ఆగిన వెంటనే క్లోరిఫైరిఫాస్ 2 ఎంఎల్ లేదా థయోడికార్బ్ గ్రాము మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. మిరప, టమాటా, క్యాబేజీ తదితర పంటలపై ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో లేదా మోటాలాక్సిల్, మాంకోజెబ్ లీటరు నీటిలో 2 గ్రాములు కలిపి మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బండిజం లీటరు నీటిలో గ్రాము లేదా మాంకోజెబ్ లీటరు నీటిలో 2.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. బ్యాక్టీరియా మచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటిలో 3 గ్రాములు, ప్లాంటామైసిన్ 2 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలని రిని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు, వీఏఏలు దుర్గాప్రసాద్, నందిని, భాగ్యలక్ష్మి, ఆషిక పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం


దాతలు సమకూర్చిన సామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అనపర్తి ప్రాంతీయ ఆరోగ్యకేంద్రం, ఆసుపత్రిలో మౌలిక వసతులు, సదుపాయాల కల్పనకు దాతలు, ఆసుపత్రి అభివృద్ధి, నిర్వహణ కమిటీ అందిస్తున్న సహకారం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రికి మండలంలోని రామవరం గ్రామానికి చెందిన సబ్బెళ్ల సురేష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి, నియోజకవర్గంలోని బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన తేతల సుబ్బరాజు, అనపర్తికి చెందిన కర్రి ధర్మారెడ్డి(గోశాల) ఆర్థిక సహకారం రూ.84 వేలుతో సమకూర్చిన స్టీల్ బెడ్స్, ఆసుపత్రి నిర్వహణ నిధులతో రూ.36 వేలు విలువ చేసే మూడు స్టీలు బెడ్లు, రూ.20 వేలు విలువ చేసే 48 స్టీల్ స్టూల్స్, రూ. 25 వేలు విలువ గల కర్టెన్లను మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య రంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యత నిస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోందని అన్నారు. 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయితే అనపర్తి ఏరియా ఆసుపత్రిలో దాతల సహకారంతో మౌలికసదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, ఆసుపత్రి స్థల దాతలు ద్వారంపూడి వెంకటరెడ్డి, ద్వారంపూడి బుల్లమ్మాయి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, గుంటూరు శ్రీను చింతా శ్రీనివాసరెడ్డి, చింతా గోపాలకృష్ణారెడ్డి, సత్తి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించకుంటే చర్యలు


సీతానగరంలో మేకలను పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ డీడీ వెంకటేశ్వరరావు

సీతానగరం: సిబ్బంది సమయ పాలన పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని పశు సంవర్ధక శాఖ రాజమహేంద్రవరం డివిజన్ ఉప సంచాలకుడు ఎం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. వెదుళ్లపల్లి, చినకొండేపూడి పశువుల ఆసుపత్రిని ఆయన మంగళవారం సందర్శించారు. సమయ పాలన పాటించని పశు వైద్యులు, యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్ల(ఏహెచ్ఏ)పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరూ సమయ పాలన పాటించాలని, రైతులకు అందుబాటులో ఉండాలని, తుపాను కారణంగా పశు మరణాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తుపాను నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై రైతులకు, ఏహెచ్ఏలు, గోపాలమిత్రలకు సూచనలు చేశారు. పశువులను మెట్ట ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. లేగదూడలకు హెచ్ఎస్, బీక్యూ వ్యాక్సిన్లు వేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో త్వరితగతిన టీఎంఆర్ బుక్ చేసి, వారికి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఏహెచ్ఏలందరూ ఆయా పంచాయతీ కార్యదర్శులతో అనుసంధానమై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, వర్షాలు తగ్గేంత వరకూ అందరూ హెడ్ క్వార్టర్స్‌లోనే తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని వెంకటేశ్వరరావు ఆదేశించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.ప్రభావతి, డాక్టర్ భానుతేజ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారులు అందుబాటులో ఉండాలి

రంగంపేట: మిచాంగ్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని పశు వైద్య అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ మూర్తి సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన రంగంపేట పశువైద్య కార్యాలయంలో నిర్వహించిన పాడి రైతుల అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పశువులను మెట్టప్రాంతాలకు తరలించి వెచ్చని ప్రదేశంలో ఉండేలా చూడాలని రైతులకు సూచించారు. చలి గాలుల వల్ల ప్రబలే వ్యాధులు రాకుండా పశువులకు టీకాలు వేయించుకోవాలన్నారు. అత్యవసర కేసుల కోసం వెటర్నరీ అంబులెన్సు సర్వీసులు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలన్నారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్లు, గోపాల మిత్రలు ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఈ. జాన్‌పాల్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు 6 నెలల జైలు

కడియం: నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి, ఒక మహిళ చేయి పోవడానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పేపకాయల గోపాలానికి రాజమహేంద్రవరం ఏడో అదనపు జిల్లా జడ్జి పి.బాబు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. కడియం ఇన్‌స్పెక్టర్ జీవీజీ తిలక్ స్థానిక విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. 2019 ఫిబ్రవరి 15న ఆలమూరు మండలం సంధిపూడికి చెందిన జి.సీతామహాలక్ష్మి వ్యానులో ప్రయాణిస్తోంది. కడియం మండలం దుళ్ల శివార్లకు వచ్చేసరికి పేపకాయల గోపాలం ట్రాక్టర్‌పై తాటి దుంగలు వేసుకుని వస్తున్నాడు. వ్యాన్‌ను రాసుకునేలా తన ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా నడిపాడు. దీంతో చేతికి దుంగలు తగిలి సీతామహాలక్ష్మి తీవ్రంగా గాయపడింది. వైద్యులు ఆమె చేతిని తొలగించారు. ఈ ప్రమాదంపై అప్పటి కడియం ఎస్సై శ్రావణిదేవి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


కార్యదర్శులకు స్పోర్ట్స్ మెటీరియల్ అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు తదితరులు

రంగంపేట: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిన ఉల్లాసం లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర, వికసిత్ భారత్, కులగణన తదితర కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు, ఫిజికల్ డైరెక్టర్లు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కులగణన సర్వేలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సచివాలయాలకు కేటాయించిన స్పోర్ట్స్ మెటీరియల్‌ను పంచాయితీ కార్యదర్శులకు అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సత్యరమేష్, తహసీల్దార్ ఎం.దొరకయ్య, ఎంపీడీఓ బి.శ్రీరామరాజు, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు, చేనేత విభాగాల కార్యదర్శులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పాలాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.